సాక్షి
బాపట్ల
బుధవారం । 14 । జూన్ । 2023



సుబ్రహ్మణ్యుని సేవలో..

మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు మంగళవారం దర్శించుకున్నారు.



ఫిట్‌నెస్‌లేని బస్సులపై కేసులు

పట్నంబజారు (గుంటూరు): రవాణా శాఖ అధికారులు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేపట్టారు. ఫిట్‌నెస్ లేని పది స్కూల్ బస్సులపై కేసులు నమోదు చేశారు.



కార్తికేయునికి వెండి నగలు

విజయవాడపశ్చిమ: ఇంద్రకీలాద్రిపై కొలువైన సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి హైదరాబాద్‌కు చెందిన పొత్తూరి కిరణ్‌కుమార్ కుటుంబం మంగళవారం వెండి నగలు బహూకరించింది.

న్యూస్‌రీల్

22 నుంచి సెల్ ఫోన్ సర్వీస్‌లో ఉచిత శిక్షణ

కొరిటెపాడు(గుంటూరు): యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ నుంచి సెల్ ఫోన్ రిపేర్, సర్వీసెస్‌లో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ జి.బి.కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి చదివి, వయస్సు 19 నుంచి 45 ఏళ్లలోపు ఉండాలని సూచించారు. శిక్షణ కాలం 30 రోజులు ఉంటుందని పేర్కొన్నారు. ఉచిత భోజనంతో పాటు ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తామని తెలిపారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్ట్ ఫొటోలు, 10వ తరగతి పాస్ లేదా ఫెయిల్ మార్కుల జిరాక్స్ కాపీలతో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, ఓల్డ్ బ్యాంక్ వీధి, కొత్తపేట, 0863-2336912, 9700687696, 8125397953, 9949930155 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఆయన తెలిపారు.

మూడు గంటలు ఆగిన ప్యాసింజర్ రైలు



సింగరాయకొండ: బిట్రగుంట నుంచి విజయవాడ వెళ్లే మెము ప్యాసింజర్ రైలు ప్రకాశం జిల్లా సింగరాయకొండ రైల్వేస్టేషన్‌కు మంగళవారం ఉదయం 5 గంటలకు వచ్చింది. వెంటనే బయలుదేరాల్సి ఉండగా.. దాదాపు 3 గంటల సేపు అక్కడే ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు ఏం జరిగిందో అర్థం కాక, రైలు ఎప్పుడు బయలుదేరుతుందో తెలియక ఇబ్బందులు పడ్డారు. దీనిపై రైల్వే అధికారులను వివరణ కోరగా చిన్నగంజాం వద్ద రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు జరుగుతున్నాయని, అందువల్ల రైలు నిలిపివేసినట్లు చెప్పారు. చివరికి రైలు 7.50 గంటలకు బయలుదేరి వెళ్లటంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

యార్డుకు 42,149 బస్తాల మిర్చి రాక

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 42,139 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 38,918 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్‌ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.24,300 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాల్‌కు రూ.14,000 నుంచి రూ.23,800 వరకు ధర లభించింది. ప్రత్యేక రకాల మిర్చికి రూ.11,500 నుంచి రూ.24,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 7,873 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో నవోదయం

నరసరావుపేట: ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం విద్యా, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రతి నెలా నిర్వహిస్తున్న నవోదయం కార్యక్రమం బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. నిరుద్యోగ యువత హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 520.30 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 450 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.20 అడుగుల వద్ద ఉంది.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ.1,200, గరిష్ఠ ధర రూ.2,400, మోడల్ ధర రూ.1,600 వరకు పలికింది.

ఉపాధికి వందనం

పేదల బతుకుకు సర్కార్ భరోసా

- ఎస్సీ, ఎస్టీలకు నూరు రోజుల పని
- ప్రణాళిక సిద్ధం చేసిన ప్రభుత్వం
- జిల్లాలో 85,454 ఎస్సీ కుటుంబాలకు, జాబ్ కార్డులు
- 12 వేల ఎస్టీ కుటుంబాలకు కార్డులు
- అందరికీ నూరు రోజులు పని కల్పించే లక్ష్యం
- ఎస్సీ, ఎస్టీ కాలనీలు దత్తత తీసుకున్న అధికారులు
- ఈ ఆర్థిక సంవత్సరంలో లక్ష్యం చేరుకునేందుకు కసరత్తు



ఎస్సీ కాలనీలో ఉపాధి హామీ పథకంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సాక్షిప్రతినిధి, బాపట్ల: పేదవర్గాలకు ప్రధానంగా ఎస్సీ, ఎస్టీలకు నూరుశాతం ఉపాధి పనులు కల్పించేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సిద్ధమైంది. దీంతో జిల్లా అధికారులు ఉపాధిహామీ పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీలకు నిబంధనల మేరకు నూరు రోజుల పని కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు జాబ్‌కార్డులు ఇప్పటికే పంపిణీ చేశారు. పొరపాటున మిగిలిపోయినవారికి తాజాగా జాబ్‌కార్డులు అందజేస్తున్నారు. ప్రధానంగా ఎస్టీ కాలనీలను గుర్తించి జాబ్‌కార్డులు పంపిణీచేశారు.

ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ఇలా..

	ఎస్సీ	ఎస్టీ	ఇతరులు	మొత్తం
పనులు పొందిన కుటుంబాలు	48,137	4,242	82,799	1,35,178
చేసిన పనిదినాలు	13,87,957	1,29,980	23,68,009	38,85,946

73 శాతం ఎస్సీ కుటుంబాలకు మేలు

జిల్లాలో 1,13,000 ఎస్సీ కుటుంబాలు ఉండగా ఇందులో 82,454 (73 శాతం) కుటుంబాలకు జాబ్‌కార్డులు ఇచ్చారు. 23,125 ఎస్టీ కుటుంబాలు ఉండగా 12 వేల కుటుంబాలకు జాబ్ కార్డులు అందజేశారు. ఈ రెండు వర్గాల్లో అందరికీ జాబుకార్డులు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గతంలో జాబ్‌కార్డులు ఉన్నా పనులకు వచ్చేవారికి మాత్రమే అధికారులు పనులు కల్పించారు. తాజాగా ప్రభుత్వ ఆదేశాలతో ఎస్సీ, ఎస్టీలకు పూర్తిస్థాయిలో పనులు కల్పించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. వీరికి ఈ ఆర్థిక సంవత్సరంలో నూరు రోజులు పని కల్పించాలన్నది లక్ష్యం. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్ మొదలు పీడీ వరకూ అన్నివిభాగాల అధికారులు ఎస్సీ, ఎస్టీ కాలనీలను దత్తత తీసుకుని వారికి పూర్తిస్థాయిలో పనులు కల్పించేందుకు సిద్ధమయ్యారు. వారు ఉన్న ప్రాంతంలోనే కూలీలకు పనులు కల్పిస్తున్నారు. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో నూరురోజుల పనులు పొందిన కుటుంబాలు మొత్తం 311 ఉండగా, వీటిలో ఎస్సీ కుటుంబాలు 94, ఎస్టీ కుటుంబాలు 15 ఉన్నాయి. జూలై నాటికి ఐదువేల కుటుంబాలకు నూరు రోజుల పని కల్పించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ఇప్పటికే 81 రోజులనుంచి 99 రోజుల మధ్య పనిదినాలు పూర్తిచేసుకున్న కుటుంబాలు నాలుగువేలు ఉన్నాయి.

వారంవారం చెల్లింపులు

గతంలో రెండునెలలకోసారి ఉపాధికూలీలకు డబ్బులు చెల్లించేవారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక వారం పూర్తికాకముందే కూలిడబ్బులు జమచేస్తున్నారు. ఒక్కొక్కరికి కూలిని రూ.272కు పెంచారు.

ప్రభుత్వం మాకు ఉపాధి కల్పిస్తోంది



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉపాధిపనులు కల్పిస్తోంది. మేము రోజూ పనికి వెళ్తున్నాం. ప్రతిఒక్కరికీ నూరు రోజులపాటు పనికల్పిస్తామని అధికారులు ఇంటివద్దకే వచ్చి చెబుతున్నారు. మాకు అందుబాటులోనే పనులు కల్పిస్తున్నారు.

– వసంతరావు, పాపాయపాలెం, వేటపాలెం మండలం.

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు



పేదలకోసం అన్నిపథకాలు ఇంటివద్దకే చేరుస్తున్న జగనన్న మాకు ఉపాధి పనులు కల్పిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీలందరికీ నూరురోజులు పని ఇస్తారట. అధికారులు వచ్చి ఈ విషయం స్వయంగా చెప్పి మాకు దగ్గరలోనే పనులు కల్పిస్తున్నారు. జగనన్నకు ధన్యవాదాలు.

– ఇందిరమ్మ, పాపాయపాలెం,వేటపాలెం మండలం.

జగనన్న ప్రభుత్వం పేదల సర్కారు



పేదోళ్లకు అడక్కుండానే అన్నీ చేస్తున్న ప్రభుత్వం జగనన్న సర్కారు. సంక్షేమ పథకాలతోపాటు ఉపాధి పనులను కల్పిస్తున్నారు. నూరు రోజులకు తగ్గకుండా పనులు కల్పించడం సంతోషం. ఈ పనులు మాలాంటి పేదలకు మరింత ఉపయోగం.

– విజయ,పాపాయపాలెం, వేటపాలెం మండలం

పేదలను ఆదుకునేందుకు..

పేదవర్గాలను ఆదుకునేందుకు ఉపాధిహామీ పథకాన్ని అమలు చేస్తున్న ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు అండగా నిలిచేందుకు వారికి నూరు రోజులకు తగ్గకుండా ఉపాధి పనులు కల్పించాలని నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు వంద రోజుల పనులు కల్పిస్తున్నాం. అధికారులు ఎస్సీ, ఎస్టీ కాలనీలను దత్తత తీసుకుని వారికి అవగాహన కల్పిస్తున్నారు. స్థానికంగానే పనుల కల్పనకు కృషి చేస్తున్నాం.

– శంకర్‌నాయక్, డ్వామా పీడీ, బాపట్లజిల్లా

తల్లిఒడి నుంచి జారి మృత్యుకౌగిలికి..

- రోడ్డు ప్రమాదంలో మూడేళ్ల బాలుడి దుర్మరణం
- రోడ్‌రోలర్ తలపైకి ఎక్కడంతో మృతి
- గుండెలవిసేలా రోదించిన తల్లిదండ్రులు
- కంటతడి పెట్టిన స్థానికులు



పెదకాకాని: అప్పటివరకు అమ్మానాన్నలతో కలిసి స్కూటీపై ప్రయాణిస్తూ తల్లిఒడిలో కూర్చుని ముద్దు ముద్దు మాటలు చెప్పిన ఆ చిన్నారి అంతలోనే మృత్యుకోరల్లోకి జారాడు. తల్లిదండ్రులకు తీరని కడుపుకోత మిగిల్చాడు. ఈ హృదయ విదారక ఘటన మంగళవారం పెదకాకాని మండలం కొప్పురావూరు అడ్డరోడ్డు వద్ద జరిగింది. తాడికొండకు చెందిన షేక్ మాబుసుభాని, గౌసియా దంపతులకు ఒక ఆడపిల్ల, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. వీరిలో చివరివాడు షేక్ షమీర్(3). మాబు సుభాని, గౌసియాకు ఇంటి వద్ద పాత ఇనుప సామాన్ల(స్క్రాప్) షాపు ఉంది. వ్యాపార పనుల నిమిత్తం మంగళవారం ఉదయం షేక్ గౌసియా గుంటూరు ఆటోనగర్ వచ్చింది. తిరిగి వెళ్లేందుకు భర్తకు ఫోన్ చేయడంతో షేక్ మాబుసుభాని స్కూటీపై తన మూడేళ్ల బాబు షమీర్‌ను వెంట తీసుకువచ్చాడు. తిరుగు ప్రయాణంలో కొప్పురావూరు మీదుగా తాడికొండ బయలుదేరారు. అడ్డరోడ్డు వద్దకు చేరుకునే సరికి రోడ్డు మరమ్మతుల్లో భాగంగా రోడ్ రోలర్ చదును చేస్తూ ఉంది. దాని పక్కగా వెళ్తుండగా స్కూటీ అదుపు తప్పింది. దీంతో గౌసియా ఒడిలో ఉన్న షమీర్ ఒక్కసారిగా జారిపోయాడు. రోడ్డుపై పడ్డాడు. అంతలోనే రోడ్‌రోలర్ చక్రం బాబు తలపైకి ఎక్కింది. ఘటనాస్థలంలోనే షమీర్ మరణించాడు. కొడుకు మృతదేహం వద్ద తల్లిదండ్రులు గుండెలవిసేలా విలపించిన తీరు స్థానికులను కలచివేసింది. తల్లి షేక్ గౌసియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తా

- పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్
- చెంఘీజ్‌ఖాన్‌పేటలోని బున్నీనగర్ సందర్శన
- కుష్టుబాధితుల కష్టాలపై క్షేత్రస్థాయి పరిశీలన
- పరిష్కారానికి ఆదేశాలు



కాలనీ వాసులతో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

యడ్లపాడు: అవకాశం ఉన్నంత వరకు సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని, బాధితులకు అండగా ఉంటానని కలెక్టర్ శివశంకర్ లోతేటి చెప్పారు. యడ్లపాడు మండలం చెంఘీజ్‌ఖాన్‌పేట పంచాయతీలోని కుష్టు రోగులు నివసించే బున్నీనగర్‌ను మంగళవారం రాత్రి ఆయన సందర్శించారు. ఇటీవల కలెక్టరేట్‌లో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కాలనీ వాసులు తమ సమస్యలను పరిష్కరించాలని అర్జీ పెట్టుకున్నారు. దీంతో కలెక్టర్ మంగళవారం రాత్రి అధికారులతో కలిసి కాలనీకి వచ్చారు. చిమ్మచీకటిలోనే కాలనీ అంతా పర్యటించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణంపై ఉన్నతాధికారులతో అక్కడి నుంచే ఫోన్‌లో మాట్లాడారు. అలాగే సాగు భూమి విషయం కోర్టులో ఉందని, రెవెన్యూ, ప్రభుత్వ న్యాయవాదితో మాట్లాడి పరిష్కరిస్తామని చెప్పారు. ప్రతినెలా చికిత్సల కోసం స్వచ్ఛంద సంస్థల ద్వారా ప్రత్యేక గది ఏర్పాటు చేస్తామన్నారు. స్థానిక దివ్యాంగుడికి త్వరలోనే రూ.82 వేల విలువైన ఈ- ట్రైసైకిల్‌ను అందిస్తానన్నారు. స్థానికంగా వలంటీర్ లేరని, తెలిసి కాలనీవాసినే నియమించాలని ఎంపీడీవోను ఆదేశించారు. కాలనీలోని చర్చి వద్ద మరుగుదొడ్లను నిర్మించాలని అధికారులకు చెప్పారు. ప్రస్తుతం కాలనీ వాసులు బోరు నీరు వినియోగానికి చందాలు వేసుకుంటున్నామని తెలపడంతో ఆ పనిని పంచాయతీ చేపట్టాలని సూచించారు. రోగులు కొందరికి వైఎస్సార్ పెన్షన్ కానుక రావడం లేదని చెప్పడంతో పరిష్కారానికి కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ శోభారాణిని ఆదేశించారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్ ప్రతి నెలా కాలనీలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని యడ్లపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి గోపీనాయక్‌ను ఆదేశించారు. ఆరోగ్యసేవలు అందించేందుకు పంచాయతీ పాత భవనాన్ని ఇచ్చేలా గ్రామపెద్దలను ఒప్పించారు.

పరిశ్రమల ప్లాట్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ పి.గోపీకృష్ణ

నరసరావుపేట: జిల్లాలోని పలు ప్రాంతాల్లో చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల స్థాపన కోసం స్థలాలను సేకరించి ప్లాట్లుగా విభజించి www.apiic.in వెబ్‌సైటులో ఉంచామని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు www.apindurtrier.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ పి.గోపీకృష్ణ వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. పిడుగురాళ్లలో 11.38 ఎకరాలు సేకరించి 146 ప్లాట్లుగా విభజించి రిజర్వేషన్ ప్రకారం ఇప్పటివరకు 124 ప్లాట్లు కేటాయించామని పేర్కొన్నారు. మిగిలిన 22 ప్లాట్లు చదరపు మీటరు రూ.3031లకు రిజర్వేషన్ ప్రకారం కేటాయించేందుకు ఏపీఐఐసీ వెబ్‌సైటు www.apiic.in లో ఉంచామని వివరించారు. దాచేపల్లి మండలం నడికుడిలో ఒక ప్లాటు చదరపు మీటరు రూ.2,059 ధరతో ఖాళీప్లాట్లను రిజర్వేషన్ ప్రకారం వెబ్‌సైటులో ఉంచామని, మాచర్ల మండలం రాయవరం గ్రామంలో 54.63ఎకరాల విస్తీర్ణంలో 10 ప్లాట్లను చదరపు మీటరు రూ.389కు కేటాయించామని వివరించారు. మిగిలిన 52 ఖాళీ ప్లాట్లను రిజర్వేషన్ ప్రకారం వెబ్‌సైట్‌లో పొందుపరిచామని, అదే గ్రామంలో 152.44 ఎకరాల విస్తీర్ణాన్ని ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు కేటాయించినట్లు వెల్లడించారు. అందులో 42 ప్లాట్లను చదరపు మీటరు రూ.1,215లకు కేటాయించేందుకు రిజర్వేషన్ ప్రకారం వెబ్‌సైటులో ఉంచామని పేర్కొన్నారు. ఆసక్తిగల పారిశ్రామిక వేత్తలు www.apindurtrier.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పేరేచర్లలో వ్యక్తి దారుణ హత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ వాసు

మేడికొండూరు: మేడికొండూరు మండలం పేరేచర్ల జగనన్న కాలనీలో వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. పల్నాడు జిల్లా సత్తెనపల్లి శాలివాహన నగర్‌కు చెందిన మందా సైదేశ్వరరావు (33) స్థానిక జగనన్న కాలనీలో జన సంచారం లేని ప్రాంతంలో గాయాలతో చనిపోయి పడి ఉన్నాడు. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలాన్ని సందర్శించిన సీఐ వాసు హత్యగా గుర్తించారు. గుర్తుతెలియని వ్యక్తులు తలపై రాయితో మోది, కత్తితో పొడవడంతో తీవ్రరక్తస్రావంతో మరణించినట్టు నిర్ధారించారు. సైదేశ్వరరావు టాటాఏస్ డ్రైవర్ అని గుర్తించారు. ఘటనా స్థలంలో టాటాఏస్ వాహనం కూడా ఉంది. వివాహేతర సంబంధం నేపథ్యంలో హత్య జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు. క్లూస్ టీమ్, డాగ్‌స్క్వాడ్ బృందాలు రంగంలో దిగి ఆధారాలు సేకరించాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆణిముత్యాలకు ఆశీస్సులు

- ప్రతిభావంతులకు ప్రోత్సాహకం
- ప్రభుత్వ విద్యాసంస్థల్లో కొత్త అధ్యాయానికి శ్రీకారం
- ఈనెల 15న నియోజకవర్గ, 17న జిల్లాస్థాయిలో నగదు పురస్కారాలు ప్రదానం
- పాఠశాల స్థాయిలో సత్తాచాటిన వారికీ వెన్నుదన్ను



ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివి ప్రతిభ చాటిన విద్యార్థులను నగదు ప్రోత్సాహకాలు ఇచ్చి సత్కరించాలనే మహత్తర ఆలోచనతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. జగనన్న ఆణిముత్యాలు పేరుతో వినూత్న కార్యక్రమం చేపట్టారు. ఇంటర్మీడియెట్, టెన్త్ పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను ఇవ్వాలని నిర్ణయించారు. ఈమేరకు గుంటూరు జిల్లాలో ఈనెల 15న నియోజకవర్గ, 17న జిల్లాస్థాయిలో ప్రతిభా పురస్కారాల ప్రదాన కార్యక్రమం జరగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లలో విద్యాశాఖాధికారులు నిమగ్నమయ్యారు.

ఏడు నియోజకవర్గాల వారీగా ఎంపిక

గుంటూరు జిల్లాలో ఏడు నియోజకవర్గాలు ఉండగా, నియోజకవర్గ స్థాయిలో టెన్త్‌లో 23 మంది, ఇంటర్‌లో 15 మంది అత్యధిక మార్కులు సాధించారు. వీరికి ఈనెల 15న ఆయా నియోజకవర్గాల పరిధిలో ఎమ్మెల్యేల చేతుల మీదుగా ప్రోత్సాహకాల పంపిణీ జరగనుంది. జిల్లాస్థాయిలో టెన్త్‌లో 16 మంది, ఇంటర్మీడియెట్‌లో నలుగురు అత్యధిక మార్కులు పొందారు. వీరికి ఈనెల 17న జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రజాప్రతినిధుల సమక్షంలో నగదు ప్రోత్సాహకాలు అందించనున్నారు. వీరితోపాటు జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పరిధిలో ప్రతి పాఠశాల నుంచి తొలి మూడుస్థానాల్లో నిలిచిన టెన్త్ విద్యార్థులకూ నగదు ప్రోత్సాహకాలను అందించేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. జిల్లావ్యాప్తంగా పాఠశాల స్థాయిలో 469 మంది విద్యార్థులకు ప్రోత్సాహకాలు దక్కనున్నాయి. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులకు ఈనెల 20న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నగదు ప్రోత్సహకాన్ని అందజేయనున్నారు.

ఏర్పాట్లు చేస్తున్నాం

జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాలను జిల్లాలోని ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఎమ్మెల్యేలతోపాటు ఇతర ప్రజాప్రతినిధులను ఆహ్వానించి వారి సమక్షంలో ప్రోత్సాహకాలు అదించాలని ప్రధానోపాధ్యాయులకు మార్గదర్శకాలు జారీ చేశాం. జిల్లాస్థాయిలో మంత్రులు, కలెక్టర్ ఆధ్వర్యంలో నగదు ప్రోత్సాహకాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నాం.

– పి.శైలజ, డీఈఓ

ప్రోత్సాహకాల పంపిణీ ఇలా(రూపాయల్లో)

స్థాయి	ప్రథమ స్థానం	ద్వితీయ స్థానం	తృతీయ స్థానం
జిల్లా	50,000,	30,000	10,000
నియోజకవర్గ	15,000	10,000	5,000
పాఠశాల	3,000	2,000	1,000

చిన్నారుల్లో పోషణపై శ్రద్ధపెట్టాలి

- 'వైఎస్సార్ సంపూర్ణ పోషణ'ను సమర్థంగా అమలు చేయాలి
- లేకుంటే అధికారులపై చర్యలు తప్పవు
- బాపట్ల కలెక్టర్ రంజిత్‌బాషా ఆదేశం
- 8 మంది ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు షోకాజ్ నోటీసులు



కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల పోషణ లోపం నివారణపై అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. అంగన్ వాడీ కేంద్రాల్లో సంక్షేమ పథకాల అమలుతీరుపై సంబంధిత అధికారులు, పర్యవేక్షకులతో మంగళవారం స్పందన సమావేశ మందిరంలో ఆయన సమీక్ష నిర్వహించారు. చిన్నారులంతా ఆరోగ్యంగా ఎదగడానికి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు వారికి అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా చిన్నారులకు పోషకాహారం అందుతోందని వివరించారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో ఎనిమిది అంశాలు పురోగతిలో ఉండేలా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సంపూర్ణ పోషణ పథకం లక్ష్యాలు 78 శాతం చేరుకోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. అంగన్ వాడీ కేంద్రాల కార్యకర్తలు, ఆయాల పోస్టుల ఖాళీపై ఆరా తీశారు. భర్తీకి చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పోషణ లోపానికి గురైన లబ్ధిదారుల ఇళ్లకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు స్వయంగా వెళ్లాలని కలెక్టర్ ఆదేశించారు. కిశోర బాలికల్లో రక్తహీనత నివారణకు ఐరన్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు.

అధికారులపై అసహనం

నగరం మండలంలో వయస్సుకు తగిన బరువులేని 48 మంది చిన్నారులు ఉండగా 26 మందికే సంపూర్ణ పోషణ ఇవ్వడం ఏమిటని అధికారులను ప్రశ్నించారు. వేమూరు మండలంలో 74 మందికి గాను 46 మందికి, బాపట్ల మండలంలో 29 మందికి గాను 20 మందికి, కొరిశపాడు మండలంలో 59 మందికి గాను 30 మంది చిన్నారులకు మాత్రమే సంపూర్ణ పోషణ అందడంపై నిలదీశారు. నగరం మండలంలోని ఇద్దరు సూపర్ వైజర్లకు షోకాజ్ నోటీసు ఇవ్వాలని, విచారణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 1,828 మంది గర్భిణులు ఉండగా 1,188 మంది పోషణ లోపంతో బాధపడుతుండడంపై కలెక్టరు ఆరాతీశారు. చిన్నగంజాం మండలంలో 22 మంది గర్భిణులు ఉండగా కేవలం 11 మందికే సంపూర్ణ పోషణ కిట్లు అందాయని, మిగిలిన వారికి ఎందుకు ఇవ్వలేదని కలెక్టర్ ప్రశ్నించారు. సమావేశానికి ఆలస్యంగా వచ్చిన ఆరుగురు సూపర్‌వైజర్లకు షోకాజ్ నోటీసులు జారీచేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. సమావేశంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ పి.డి ఉమా, సీడీపీఓలు, సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

నేడు జూడో జిల్లా జట్టు ఎంపిక

నరసరావుపేట ఈస్ట్: జూడో పల్నాడుజిల్లా జట్టు ఎంపిక బుధవారం నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శి జి.సాయిరాం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్ఏ స్టేడియంలో ఎంపికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 17వ తేదీ నుంచి 19 వరకు తిరుపతిలో నిర్వహించనున్న అంతర్‌జిల్లాల జూడో చాంపియన్‌షిప్–2023 పోటీలకు హాజరవుతారని చెప్పారు. పోటీలలో పాల్గొనేందుకు 2006 నుంచి 2008లో జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులుఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రాలతో డీఎస్ఏ స్టేడియంలో ఉదయం 10గంటలకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9347379086, 9491665781 సంప్రదించాలని కోరారు.

నేడు మినీ జాబ్ మేళా

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మినీ జాబ్ మేళా బుధవారం నిర్వహించనున్నట్లు సంస్థ జిల్లా అధికారి కె.సంజీవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పల్నాడు జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న జాబ్‌మేళాలో ఫిన్ కేర్ బ్యాంక్, హెటిరో డ్రగ్స్, స్కిల్ క్రాఫ్ట్, టీవీఎస్ యూనిటీ మోటార్ వర్క్స్ వంటి సంస్థలు పాల్గొంటాయని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటారని తెలిపారు. పదో తరగతి నుంచి పీజీ, బీటెక్, ఫార్మసీ, డిప్లొమో చదివిన నిరుద్యోగ యువత జాబ్ మేళాకు హాజరుకావాలని కోరారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఇంటర్వ్యూలు కొనసాగుతాయని వివరించారు. వివరాలకు ఎం.వీరాంజనేయులు 9160200652లను సంప్రదించాలని కోరారు.

ఇళ్ల పట్టాల పంపిణీ చారిత్రాత్మకం

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణా రెడ్డి (ఆర్కే)
- నిడమర్రు, ఐనవోలులో ఇళ్ల పట్టాలు పంపిణీ
- హాజరైన ఎమ్మెల్సీ హనుమంతరావు



ఐనవోలు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: రాష్ట్రంలో ఇళ్ల పట్టాల పంపిణీ చారిత్రాత్మకంగా నిలిచిపోతుందని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తెలిపారు. మంగళవారం నగర పరిధిలోని నిడమర్రు, మండల పరిధిలోని ఐనవోలులో తాడేపల్లి ఉండవల్లి సెంటర్, కెఎల్ రావు కాలనీ, మహానాడు, సీతానగరం ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులు 1817 మందికి ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ రాష్ట్రంలో ఇళ్లు లేని పేదవారు ఉండకూడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంతిల్లు ఉండేలా ఇళ్ల పట్టాల పంపిణీ జరిగిందన్నారు. రానున్న రోజులలో నిడమర్రు లే అవుట్ ఒక చిన్న పట్టణంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజు, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నబోతుల దుర్గారావు, అనుబంధ సంఘాల నాయకులు బలసాని అనిల్, మేకా వెంకటరామిరెడ్డి, బండి వెంకటరెడ్డి, నగర పాలక సంస్థ డీసీపీ మహాలక్ష్మి దొర, ఏసీపీ వెంకటేశ్వర్లు, టీపీవో వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

జగనన్నకు రుణపడి ఉంటాం



కాలువ కట్టలపైనా, సీతానగరం కృష్ణా నది ఒడ్డున ప్రభుత్వ స్థలాల్లో ఎప్పటి నుంచో ఇళ్లు నిర్మించుకుని ఉంటున్నాం. సొంతిల్లు అనే మాటే కాని ప్రభుత్వం ఎప్పుడు ఖాళీ చేయిస్తుందో లేక ఎక్కడ వరదలు వస్తే ఇళ్లు వదిలి ఎక్కడికి వెళ్లాలనే ఆందోళనతోనే జీవిస్తున్నాం. సొంతిల్లు పట్టా తీసుకుని సొంతిల్లు కట్టుకునే అవకాశం కల్పించిన జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– అనుముల నారాయణమ్మ, తాడేపల్లి

దూరం లేదు- భారం కాదు



సొంతిల్లు ఎక్కడ ఉంటే అక్కడే ఉంటాం. కావాలనే కొందరు తాడేపల్లి వారికి నిడమర్రులో ఇస్తారా అంటున్నారు. సొంతిల్లు ఎక్కడుంటే అక్కడే ఉంటాం. ఇక దూరంతో మాకేం పని. దూరమైనా దగ్గరైనా అద్దె ఇంట్లో ఉండటం కష్టం కాదా? జీవితంలో సొంతిల్లు నిర్మించుకోలేం అనుకున్నాం. సీఎం జగనన్న మా కలనెరవేర్చారు.

– తమ్మిశెట్టి రమణ, తాడేపల్లి

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ అర్జున్‌రావు

జి.పంగులూరు: ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకుని డ్వాక్రా మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ బీ అర్జున్‌రావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో వీఓఏల సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశానికి ఏపీఎం జ్యోతిప్రసాద్ బాబు అధ్యక్షత వహించారు. అర్జున్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు అనేక కొత్త పథకాలు ప్రవేశపెట్టిందని తెలిపారు. 35 శాతం రాయితీతో పీఎంఈజీపీ పథకం ద్వారా బ్యాంక్ రుణాలు అందజేస్తున్నట్లు చెప్పారు. పొదుపు మహిళలతో ప్రతి వీఓఏ నమ్మకంగా ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా ఉండాలన్నారు. చదువురాని పొదుపు మహిళలకు వారికి అర్థం అయ్యే రీతిలో పొదుపు లెక్కలు వివరించాలని చెప్పారు. మండలంలోని స్త్రీనిధి రికవరీకి సంబంధించి రూ.25 లక్షలు ఎన్‌పీఏలపై ఆరా తీశారు. మండలంలోని 35 గ్రామ సంఘాలకు గాను మూడు గ్రామ సంఘాల నుంచి స్త్రీనిధి రికవరీ పెండింగ్‌ను వెంటనే క్లియర్ చేయాలని పేర్కొన్నారు. ప్రతి గ్రామం సంఘం నుంచి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న వారికి రూ.35 వేలు రుణం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామాంజనేయులు, వెటర్నరీ డాక్టర్ మల్లేశ్వరి, హౌసింగ్ ఏఈ రమేష్, మండల సమైఖ్య అధ్యక్షురాలు పూసల గాయత్రి పాల్గొన్నారు.

ఉదారత చాటిన లలితా ఆస్పత్రి



డాక్టర్ శ్రావణ్‌బాబుకు చెక్కు అందజేస్తున్న మేనేజర్ సురేష్

గుంటూరు మెడికల్: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఆర్‌ఎస్) కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ సూచనల మేరకు గుంటూరు లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పి.వి.రాఘవశర్మ రూ. 5 లక్షలు విరాళంగా ప్రకటించారు. గుంటూరు డీఎంహెచ్ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబుకు లలితా హాస్పిటల్ మేనేజర్ సురేష్ రూ. 5లక్షల చెక్కును అందజేశారు. సాంఘిక సంక్షేమ వెనుకబడిన తరగతుల, గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో సౌకర్యాలు, మౌలిక సదుపాయాల రూపకల్పనకు, వసతి గృహాల్లో మధ్యలో చదువులు ఆపేయకుండా విద్యార్థుల భవిష్యత్‌కు సదరు నగదును వినియోగించనున్నారు. పేద విద్యార్థులు బాగా చదువుకునేందుకు కార్పొరేట్ సంస్థలు సహాయం చేయాలని డాక్టర్ శ్రావణ్ బాబు పిలుపునిచ్చారు. రూ. 5 లక్షలు అందజేసిన లలితా హాస్పిటల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు

నరసరావుపేట: విద్యుత్ విజిలెన్స్ అండ్ ఆపరేషన్ విభాగాలకు చెందిన అధికారులు మంగళవారం పట్టణంలో తనిఖీలు నిర్వహించారు. 780 సర్వీసులను తనిఖీ చేశారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 154 మందికి రూ.4.14లక్షల అపరాధ రుసుం విధించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు బి.విజయకృష్ణ, ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 31 మంది అధికారులు, 93 మంది సిబ్బంది 31 బృందాలుగా ఏర్పడి తనిఖీ చేశారు. మీటరు లేకుండా నేరుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఐదుగురికి రూ.5 వేలు, మీటరు ఉన్నా చౌర్యానికి పాల్పడుతున్న నలుగురుకి రూ.38వేలు, అనుమతించిన కేటగిరి కాకుండా ఇతర కేటగిరిలో విద్యుత్ వాడుకుంటున్న ఇద్దరికి రూ.9 వేలు, అనుమతించిన లోడు కంటే అధికంగా విద్యుత్ వాడుతున్న 143 మందికి రూ.3.62లక్షలు అపరాధం రుసుం విధించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ట్రాఫిక్ సమస్యకు పరిష్కార 'మార్గాలు'

- గుంటూరులో నిర్దేశించిన ప్రదేశాలలో వాహనాలు నిలుపుదల చేయాలి
- రహదారులు ఆక్రమించుకుని వ్యాపారాలు చేయవద్దు
- ఇష్టానుసారమైన నంబర్ల ప్లేట్లపై చర్యలకు ఆదేశం
- వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి
- స్పష్టం చేసిన ఎస్పీ కె.ఆరిఫ్ హాఫిజ్



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫిజ్, పక్కన ఏఎస్పీ సుప్రజ

నగరంపాలెం: గుంటూరు నగరంలోని ప్రధాన రహదారుల మీదుగా, రద్దీగా ఉండే ప్రాంతాలలో రాకపోకలు చేపట్టే వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హాఫిజ్ స్పష్టం చేశారు. గుంటూరు నగరంలో నెలకొన్న ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా మంగళవారం నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో ట్రాఫిక్ పోలీస్ అధికారులతో ఎస్పీ సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ట్రాఫిక్ పోలీస్ అధికారి / సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వహించాలని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. అతి వేగంగా వాహనాలు నడిపితే జరిగే నష్టాలపై వివరించాలని చెప్పారు.

లాలాపేట పరిధిలో..

- లాలాపేట పోలీస్‌స్టేషన్ (పీఎస్) పరిధిలోని పట్నంబజార్, పూలమార్కెట్, పేరేచర్ల బస్టాండ్ కూడలిలోని కొందరు దుకాణాదారులు రహదారులు అక్రమించుకుని వ్యాపారాలు చేస్తున్నారన్నారు. తద్వారా ప్రజలకు, వాహనదారులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని చెప్పారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దుకాణదారులను రహదారులపైకి రానీయవద్దన్నారు. నిర్దేశించిన ప్రదేశాలలో వ్యాపారాలు చేసుకునేలా చూడాలని ఆదేశించారు.

కొత్తపేట పరిధిలో..

- కొత్తపేట పీఎస్ పరిధిలోని నాజ్ కూడలి, గుంటగ్రౌండ్, డీమార్ట్ ఎదురు రహదారిపై ఎటువంటి వాహనాలను నిలుపవద్దని సూచించారు. డీమార్ట్‌కు వచ్చే, పోయే వాహనాలను సెల్లార్‌లో నిలుపుదల చేసేలా నిర్వాహకులకు తెలియజేయాలన్నారు. నాజ్ కూడలి నుంచి భగత్‌సింగ్ విగ్రహం వరకు రహదారికి ఇరువైపులా వాహనాలను నిలుపవద్దని తెలిపారు.

ఆర్టీసీ బస్టాండు పరిసరాల్లో..

- ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో ప్రైవేట్ ట్రావెల్స్ కార్యాలయాల ఎదురు ఎక్కువసేపు బస్సులను నిలుపుదల చేయడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా ఉంటోంది. ట్రావెల్స్ నిర్వాహకులతో మాట్లాడి, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని సూచించారు.

అరండల్ పేట పరిధిలో..

- అరండల్‌పేట పీఎస్ పరిధిలోని లాడ్జి కూడలి నుంచి శంకర్ విలాస్ బ్రిడ్జి వరకు ప్రతి ఆదివారం సాయంత్రం నిర్వహించే సండే మార్కెట్ వల్ల ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. నిర్దేశించిన ప్రాంతాల్లో వ్యాపారాలు నిర్వహించేలా వారికి సూచనలు చేయండి.
- నగరంలోని ప్రధాన కూడళ్లల్లో నెలకొన్న ట్రాఫిక్ సిగ్నల్ జంక్షన్‌లలో వాహనదారులు వరుస (క్యూ) పద్ధతిలో వెళ్లేలా చూడాల్సిన బాధ్యత ట్రాఫిక్ పోలీసులపై ఉందన్నారు. గుంటూరు నగరంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.
- వాహనాల నంబర్ల ప్లేట్లపై సరైన నంబర్లు లేకుండా అనధికార హోదా, పేర్లు, గుర్తులు ఉన్న వాహనదారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్దేశించిన ప్రదేశాలలో వాహనాలు నిలుపుదల చేసేలా చూడాలని చెప్పారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వారిపై ఎంవీ చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ, ట్రాఫిక్ డీఎస్పీ ఎం.బాలసుందరరావు, ఎస్‌బీ డీఎస్పీ సుభాష్, తూర్పు, పశ్చిమ సీఐలు ఎండీ.నిసార్‌బాషా, అక్కేశ్వరరావు పాల్గొన్నారు.

అనుమతిలేని పత్తి విత్తన ప్యాకెట్లు సీజ్



పత్తి విత్తన ప్యాకెట్లు స్వాధీనం చేసుకుంటున్న ఏడీఏ శ్రీనివాసరావు

కొరిటెపాడు(గుంటూరు): వ్యవసాయ, విజిలెన్స్ శాఖల అధికారులు గుంటూరు బస్టాండ్ పార్శిల్ కార్యాలయంలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో అరుణోదయ అగ్రి క్రాప్‌కార్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన అనుమతి లేని 280 పత్తి విత్తన ప్యాకెట్లను గుర్తించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా గుంటూరు ఏడీఏ టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విత్తన ప్యాకెట్లను ఎన్.రాంబాబు అనే వ్యక్తి కర్నాటక రాష్ట్రంలోని రాయచూర్ నుంచి గుంటూరు తీసుకు వచ్చినట్లు తెలిపారు. అరుణోదయ అగ్రిక్రాప్ కార్ కంపెనీకి చెందిన పత్తి విత్తన ప్యాకెట్లకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనుమతి లేని కారణంగా స్వాధీనం చేసు కుని 6–ఏ క్రింద కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు. అనుమతి ఉన్న విత్తనాలనే రైతులు కొనుగోలు చేయాలని సూచించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఏఓ జె.వాసంతి, విజిలెన్స్ తహసీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు, గుంటూరు అర్బన్ వ్యవసాయాధికారులు బి.అంజిరెడ్డి, బి.కిశోర్, విజిలెన్స్ డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పార్శిల్ కార్యాలయాలపై విజి'లెన్స్'

200 లీటర్ల పురుగు మందులు సీజ్



పురుగుమందుల పెట్టెలను పరిశీలిస్తున్న విజిలెన్స్ డీఎస్పీ

నగరంపాలెం: నగరంలోని పలు ట్రాన్స్‌పోర్టు పార్శిల్ కార్యాలయాల్లో మంగళవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్పీ కె.ఈశ్వరరావు ఆదేశాల మేరకు వివిధ పార్శిల్ కంపెనీల వాహనాలలో వాటిని తరలించి, నిల్వ చేసి లైసెన్స్ లేకుండా అక్రమంగా విక్రయించే వాటిపై విస్తృతంగా సోదాలు చేపట్టారు. వీఆర్‌ఎల్ పార్శిల్ కార్యాలయంలో అనుమతుల్లేని 200 లీటర్ల పురుగుమందులను గుర్తించారు. వాటిపై అమరావతిలో తయారు చేసినట్లు స్టిక్కర్లు అతికించారు. పసుపులేటి ఆంజనేయ ప్రసాద్ పేరుతో పార్శిల్ రాగా, అతనికి ఎటువంటి లైసెన్స్, అనుమతుల్లేవని నిర్ధారించారు. వివిధ మార్గాల్లో పురుగుమందులను తీసుకువచ్చి అక్రమ వ్యాపారం చేస్తున్నట్లు విచారణలో తేలింది. రూ.1.68 లక్షల విలువైన 200 లీటర్లను సీజ్ చేసి, '6ఎ', క్రిమినల్ కేసులు నమోదుకు ఆదేశించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారిణి జె.వాసంతి, సీఐలు ఎ.శ్రీహరిరావు, టి.లక్ష్మారెడ్డి, తహసీల్దార్ కె.నాగమల్లేశ్వర రావు, ఎస్ఐ ఎం.రామచంద్రయ్య, వ్యవసాయ అధికార, సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు అందజేస్తాం

పల్నాడు జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్



కలెక్టరేట్‌లో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జేసీ

నరసరావుపేట: పంట సాగుదారులైన కౌలు రైతులకు పంట రుణాలు, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునేందుకు సీసీఆర్సీ కార్డులు మంజూరు చేయటం జరుగుతుందని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. పంట సాగుదారుల చట్టంపై దళిత బహుజన రిసోర్స్ సెంటర్(డీబీఆర్‌సీ) చేస్తున్న ప్రచారోద్యమానికి చెందిన కరపత్రాలను మంగళవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. జేసీ మాట్లాడుతూ కౌలురైతుల కోసం ప్రచార ఉద్యమం చేసి కరపత్రాలు, ఆటో ప్రచారం, గ్రామ సమావేశాలు నిర్వహిస్తూ ఎస్సీ, ఎస్టీ రైతులకు సీసీఆర్సీ కార్డులు ఇప్పించేందుకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి మాట్లాడుతూ ప్రతి కౌలు రైతుకు సాగుదారు కార్డు జారీ చేసి బ్యాంకుల ద్వారా పంట రుణాలు ఇప్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రెవెన్యూ గ్రామంలో రైతుభరోసా కేంద్రాలలో గ్రామ అవగాహన సదస్సులు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. దానిలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్(డి.బి.ఆర్.సి) ప్రతినిధులు కూడా భాగస్వాములై ప్రతి కౌలు రైతు ఈ సదస్సులో పాల్గొనే విధంగా చూడాలన్నారు. డీబీఆర్‌సీ గుంటూరు, పల్నాడు జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప, ఏరియా కోఆర్డినేటర్స్ మేడే వెంకటరమణ, గడ్డిపర్తి కోటి రత్నం పాల్గొన్నారు.